



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -12-

*“ఆ కాలంలో నన్ను బ్రతకనివ్వనటువంటి ప్రజల మీద దండెత్తి, ‘సెల్ఫ్ ఎసర్ట్’ చేసుకోవడమే నాకు ప్రధానంగా ఉండేది. ప్రజలకు ఎంత కోపం తెప్పిస్తే, నాకు అంత సంతోషం. నన్ను ఎదిరించే వాళ్ళను అదరగొట్టడానికి ఎంత తీవ్రమైన మాటలు కూడా శక్తి హీనంగా అనిపించాయి. అందుకనే ఆనాటి పుస్తకాల నిండా అతి శయోక్తులూ, వన్ సైడ్ స్టేట్ మెంట్స్, ద్వేషంతో కూడిన తిట్లూ, అనవసర శృంగారమూ ఉండేవి. ఈ రోజు ముఖాలతో కంఠాలతో, ఉత్తరాలతో, మౌనంతో, నిశ్శబ్దంతో వ్రాయడానికీ అడగడానికీ వీలులేని పరిస్థితుల్లో నుంచి, ఆత్రుతగా నన్ను ప్రశ్నించే వారు వున్నారనీ, నా మాటలు విలువగా గ్రహించేవారు వస్తున్నారనీ తెలియగానే నా కాళ్లకు బంధాలు పడ్డాయి. నిర్విచారపు స్వేఛ్ఛా ప్రయాణం ముగిసింది. అజాగ్రత్తగా ఏం వ్రాసి, ఏం మాట్లాడి, ఏం వ్రాయక, ఏం మాట్లాడక ‘మిస్ లీడ్’ చేస్తానో నని భయం పెరిగిపోయింది. “*

ఈ మాటలు చలంగారు 1940 లో, అంటే ఆయన రచనలు ప్రారంభించిన 20 సంవత్సరాల తర్వాత వ్రాసిన వాక్యాలివి. జీవితం తిప్పిన ప్రతి మలుపులోనూ, ఎదురైన ప్రతి అనుభవంలోనూ, ఎవరికైనా సరే, వివిధ అంశాల మీద అభిప్రాయాలు మారడం అనేది సహజం. అవి మారినప్పుడల్లా, పాత అభిప్రాయాలకూ, కొత్త

అభిప్రాయాలకూ బేరీజు వేసుకోవడం, 'తప్పు' అనిపిస్తే ఒప్పుకోవడం... లాంటి నిజాయతీగల వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో చలం గారిని ప్రధమ పంక్తి లో పరిగణించ వచ్చు. ఆంధ్రదేశంలో ఉన్నంతకాలం చలనశీలతే జీవితంగా భావించిన చలం, అరుణాచలంలో నిశ్చలనమైపోయిన చలం. జీవితం లోని తొలి దశల్లో తన అంతరంగంలో కార్చిచ్చులాగ రగులుతున్న అశాంతిని అక్షర రూపంలోకి అనువదించి, జీవితంలోని మలి సంధ్యలో శాంతి లభించిందని విశ్రాంతిని కౌగలించుకొని జీవితాంతం " నేను వ్రాసిన రచనలన్నీ నన్ను నేను సంస్కరించుకోవడానికే " అని ధైర్యంగా చెప్పిన చలం.. గుడిపాటి వెంకట చలం.

చలం గారికి లీలగారు పరిచయం అయిన తొలి 5 సంవత్సరాలలో అంటే, 1940 – 45 మధ్యలో తమ పెద్ద ఆడపిల్లలిద్దరూ, మగ పిల్లవాడు... వాళ్ళ జీవితాల్లో జరిగిన సంఘటనలు చూద్దాం. అవి తల్లిగా రంగనాయకమ్మ గారిని విపరీతంగా క్రుంగ దీశాయి. మానసికంగా బలహీనురాలిని చేశాయి. అప్పటికి 30 సంవత్సరాలుగా తమ జీవిత పోరాటంలో అలసి పోయి, సొమ్మసిల్లి పోయేటటు వంటి పరిస్థితి వచ్చింది. వివరాల్లోకి వెళితే...

ముందుగా అబ్బాయి వసంత్. 'సంత్' అనీ, 'సంతీ ' అని పిలుస్తుండేవాళ్లు. ఆ కుర్రాడికి 1940– 45 సంవత్సరాలకి 20 ఏళ్ళ వయసు. బెజవాడలో సరిగ్గా చదువడం లేదని, మద్రాస్ లో ఒక ఆర్ట్ స్కూల్లో చేర్పించారని కిందటి భాగంలో తెలుసుకున్నాం. అక్కడకు వీళ్ళు నెలనెలా డబ్బులు పంపిస్తుండేవారు. కొన్నాళ్లకు కట్టాల్సిన ఫీజులు ఎక్కువ అయ్యాయి. ఎలాగైనా కష్టపడి డా:రంగనాయకమ్మ గారు డబ్బులు పంపిస్తుండేవారు. కొన్నాళ్ళకు కట్టాల్సిన ఫీజులు ఇంకా ఎక్కువ అయ్యాయి. అయినా సరే, డాక్టర్ గారు పంపిస్తుండేవారు. కొన్నాళ్ల తర్వాత వసంత్ ఆ స్కూలు కూడా మానేశాడు. ఫ్రెండ్స్ తో అటూ, ఇటూ తిరిగేవాడు. ఒక సినిమా కంపెనీలో అసిస్టెంట్ కెమెరా మెన్ గా చేరాడు. "పోనీలే ఎలాగోలా బ్రతుకుతున్నాడు "అనుకున్నారు. "మంచి కుర్రవాడు. బాగా చేస్తున్నాడు. మేమంతా కూడా అతన్ని బాగా అభిమానిస్తున్నాం " అని అక్కడ నుండి ఎవరో వుత్తరం రాశారు. వసంత్ జీవితం ఒక గాడిలో పడిందని అందరూ సంతోషించారు.

ఇంతలోనే ఉన్నట్టుండి వసంత్ వుత్తరం రాసాడు. "నేను సినిమాల్లో మానేస్తున్నాను."అని. "అదేమిటి ఎందుకిలా చేస్తున్నావు?"అంటే, " ఎందుకో ఇక్కడి మనుషులు నచ్చలేదు." అన్నాడు.
"అలా కాదు, అలా కొంత కాలం పని చేస్తే నీ జీవితం సెటిల్ అవుతుంది." అన్నారు చలం గారు.

" సెటిల్ అవ్వడం ఏమిటి? కొన్నాళ్ళు పనిచేస్తాను. వాళ్లకి కోపం తెప్పించకుండా ఉంటే, రాత్రిపగలూ కష్టపడి చేస్తే...డైరెక్టర్ ని అవుతాను. తరువాత ఏం వస్తుంది. డబ్బా, కీర్తి, వ్యామోహం ఇంతే కదా! వాటి మీద నాకు ఆసక్తి లేదు. ఏం చేస్తాయవి? పైగా ఈ మనుషులంటే నాకు అసహ్యం ఎక్కువైంది." ఇలా వితండ వాదం చెయ్యడం ప్రారంభించాడు. అంతలోనే మళ్ళీ ఆ కుర్రాడే వుత్తరం రాశాడు" నేను కాశ్మీర్ వెళ్ళిపోయి, అక్కడ బ్రతుకుతాను."

" కాశ్మీర్ ఏమిటి ? బ్రతడం ఏమిటి ? అక్కడకు వెళ్లి ఎలా బ్రతుకుతావు ?"అన్నారు చలం గారు.

"అక్కడకు వెళ్లి ఏదో చేసుకుంటాను."అని అంటే, దానికి చలం గారు వుత్తరం రాశారు.

" బాబూ! నువ్వు అక్కడకు వెళ్లి ఏదో చేసుకుంటానని అంటున్నావు. అంటే, కష్ట పడడానికి సిద్ధపడ్డావు. ఆ కష్ట పడడం ఎంత కష్టమో ఇప్పుడే తెలుసుకోవడం మంచిది. మద్రాస్ నుండి బెజవాడ వచ్చేయ్. నేనేమీ డబ్బులు పంపించను. నువ్వు ఎలా వస్తావో రా!"అన్నారు చలం గారు. అప్పుడు వసంత్, మొండిగా మద్రాస్ లో బయలు దేరి, మధ్యలో ఎవరిని అడిగాడో, లేకపోతే అడుక్కున్నాడో మొత్తానికి కాలి నడకని బెజవాడ చేరుకున్నాడు. మరి ఎన్ని వారాలు పట్టిందో, ఎన్ని నెలలు పట్టిందో తెలీదు. "పోనీలే ఎలాగోలా వచ్చాడు. ఇక్కడైనా సరిగ్గా ఉంటాడు" అనుకున్నారు. కొన్ని రోజులు ఉన్నాక " నాకు కష్ట పడడం తెలిసింది. నేను కాశ్మీర్ వెళ్ళిపోతాను." అని ఇంట్లో చెప్పేసి, ఒక మిత్రుడితో కలసి, హైదరాబాద్ మీదుగా కాశ్మీర్ వెళ్దామని బయల్దేరాడు. హైదరాబాద్ వరకూ నడచుకుంటూ వెళ్లడం మొదలు పెట్టాడు. మధ్యలో ఎక్కడో వాళ్ళనీ,వీళ్ళనీ అడిగి అన్నం తిన్నాడు. మామూలు అన్నం ఉండేది కాదు. జొన్నన్నం, గొడ్డుకారం. ఇలాంటి వన్నీ తినేసరికి హైదరాబాద్ చేరుకునేసరికి డిసెంట్రీ పట్టుకుంది. హైదరాబాద్లో వాళ్ళ పెద్దమ్మ వుంది కదా. వాళ్ళింట్లో కొద్ది కాలం వున్న తరవాత "నేను కాశ్మీర్ వెళతాను. "అన్నాడు. ఆ మాట విని ఆమె గోలపెట్టి, ఏడ్చి "నువ్వు అలాంటి పని చెయ్యొద్దు. నువ్వు మళ్ళీ బెజవాడ వెళ్ళిపో" అని ఆమె దగ్గరుండి బెజవాడ తీసుకువచ్చి వదలి వెళ్లారు. అలా తిరిగొచ్చాక కూడా ఏ పనీ చేసేవాడు కాదు. ఇంట్లో అలాగే పడుకొని ఉండేవాడు. చాలా సోమరిపోతుగా తయారయ్యాడు. అదే రోజుల్లో చలం గారికీ, లీల గారికీ పరిచయం పెరుగుతూ వుంది. ఇంకా ఏలూరు వెళ్ళలేదు. ఆ లీల గారి అమ్మాయి 'విమల' అని ఉండేది. ఆ అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. అది తెలిసి చలం గారు అన్నారు "ప్రేమలో పడ్డావు సరే! మరి ఏదో పని చెయ్యాలి కదా! ఏ పనీ చేసుకోక పోతే ఎలా?"అన్నారు.

"నాకు మళ్ళీ అలాంటి బంధనాల్లోకి వెళ్లడం ఇష్టం లేదు. "

"మరి ఎలా బ్రతుకుతావు?"

"ఇదిగో ఇప్పుడు బ్రతుకుతున్నాను కదా! అలాగే!"

"నీ పెళ్ళాన్ని ఎలా పోషిస్తావు?"

"ఇదిగో ఇప్పుడు జరుగుతున్నది కదా! అలాగే"

ఇలా చలం గారితో ఎదురు వాదించడం మొదలు పెట్టాడు వసంత్. లాగూ, చొక్కా వేసుకొని ఎప్పుడూ చాప మీద పడుకునే వాడు.

తల్లిగా రంగనాయకమ్మ గారి పరిస్థితి ఒక్కసారి ఊహించుకోండి. పెద్ద కొడుకు మరణించాడు. రెండో కొడుకైనా అంది వస్తాడు, చురుకైన వాడు అనుకుంటే, ఇలా చదువు మానేసి, ఏ పనీ లేకుండా, ఇంట్లో తిని పడుకుంటున్నాడు. తల్లిగా ఆమె మనసు విపరీతంగా గాయపడింది. అలా అని గట్టిగా ఏమీ అనలేని నిస్సహాయత. పరిస్థితి ఇలా వున్నప్పుడు చలం గారు "ఏదో ఒక పని చెయ్యి" అని చెప్పాలి. ఆనాటి పరిస్థితిని గుర్తు చేసుకుంటూ చలంగారు రాసుకున్నదేమిటంటే..

"ఏదో ఒక పని చెయ్యి అని నేను అనడం వేరు. ఫలానా పని చెయ్యి అని నేను చెప్పడం వేరు. ఫలానా పని చెయ్యి అని చెప్పడానికి నా దగ్గర కూడా ఒక పరిష్కారం లేదు. పైగా అతనికి నేను హెల్ప్ చెయ్యలేను. పోనీ ఏదో గుమస్తా పని ఇప్పిద్దామంటే, ఆ పని చెయ్యడు. నేను అతనికి సహాయ పడవలసిన వయసులో లీల గారి అధికారంలో పడి, నాకు ఏ బలమూ, వివేకమూ లేక కొట్టుకుంటున్నాను. అతనికి ఒక మార్గం చూపించగల శ్రద్ధ గానీ, పట్టుగానీ లేకపోయింది. నా బ్రతుకును చూసి నేను సిగ్గు పడుతూ, అతనికి ఏం గైడెన్స్ ఇవ్వగలను. ఆ 'మోరల్ కేర్' నాకు లేకపోయింది." ఇంట్లో వాళ్లందరికీ ఇంత షాక్ తగిలింది. ఇవి 1940 వరకూ వసంత్ జీవితంలోని కొన్ని సంఘటనలు. వీటి ప్రభావం తల్లిగా రంగనాయకమ్మ గారి మీద ఎక్కువ చూపించాయి.

ఇక ఆడపిల్లల విషయానికి వస్తే... వాళ్ళకి 20,22 సంవత్సరాల వయసు ఉంటుంది. మరి ఆ వయసు రాగానే పెళ్లి చేయడం లాంటివి ఉంటాయి కదా! ఆడపిల్లలు ఎలాగూ తన మాట వినరు. తన మాట వినకపోయినా పర్వాలేదు. వాళ్ళంతట వాళ్ళయినా పెళ్లిళ్లు చేసుకుంటే, చూసి ఆనందిద్దామని తల్లి రంగనాయకమ్మ గారు అనుకుంటుండేవారు. అలాంటి రోజుల్లో ఆ ఆడపిల్లల జీవితంలో జరిగిన 2,3 సంఘటనలు చూద్దాం.

చలంగారికి బెజవాడలో వున్నప్పుడు చాలా మంది మిత్రులు వస్తుండేవారు. ఆ మిత్రుల్లో అన్ని రకాలు ఉండేవారు. అభిమానులూ, అభిమానులు కాని వారు కూడా ఉండేవారు. కొంత మంది బయటకు వెళ్లి అపనిందలూ, అపవాదులూ వేసేవారు. అలాంటి వారు ఇంటికి రాగానే రంగనాయకమ్మ గారు తిడుతుండేవారు. దాంతోటి వాళ్ళు

బయటకు వెళ్ళిపోతుండేవారు. ఇదంతా 1940–42 ప్రాంతాలలో. ఆరోజుల్లో ఏలూరు నుండి ఒక కుర్రవాడు బెజవాడ చలం గారింటికి వస్తుండేవాడు. ఆ కుర్రవాడి పేరు శాస్త్రి. "నేను మీ రచనల విషయం లో గానీ, ప్రచురణ విషయం లోగానీ  సహాయం చేసి పెడతాను. మీ సహాయకుడిగా వుంటాను." అని, ఇంట్లోకి రావడం ప్రారంభించాడు. చలం గారికి చిన్న చిన్న పనులు చేసి పెడుతుండేవాడు.  ఇంట్లో వాళ్లకి కూడా దగ్గరయ్యాడు. ఇతను చాలా తెలివిగల వాడు. ఏ విషయం గురించి అయినా అనర్గళంగా మాట్లాడుతుండేవాడు. అందుకని రంగనాయకమ్మ గారికి గానీ, డాక్టర్ గారికి గానీ పెద్దగా అభ్యంతరం ఉండేది కాదు. చలం గారితో మాట్లాడడానికి వచ్చే సందర్భంలోనే, ఆడపిల్లలు కూడా ఇంట్లోనే ఉండేవారు కాబట్టి, వాళ్ళతో కూడా పరిచయం ఏర్పడింది.

అప్పటికే పెద్దమ్మాయి సౌరీస్ కొన్ని కథలూ, ఒక నవలా వ్రాసి వున్నారు. అవి చదివి ఆమెను మెచ్చుకోవడం "నాన్నగారి కంటే నువ్వే బాగా రాస్తున్నావు" అని పొగడడం, అప్పుడప్పుడు చలం గారు ఇంట్లో లేనప్పుడు ఆడపిల్లలతో కబుర్లు చెప్పడం చేసేవాడు. ఇలాంటివి తల్లి రంగనాయకమ్మ గారికీ, డాక్టర్ గారికి అంతగా నచ్చేవి కావు. ఒకసారి ఏం జరిగిందంటే, సౌరీస్ లేనపుడు ఆమె డైరీ చదువుతున్నాడు. తరువాత తల్లి, సౌరీస్ తో చెప్పారు "నువ్వు గమనించావా?మీ కబుర్లలో పడి కొట్టుకు పోతున్నారు.  నువ్వు లేనప్పుడు నీ డైరీ కూడా చదివాడు." దాన్ని పెద్ద సీరియస్ గా తీసుకుండా " ఏముందమ్మా దాంట్లో, నేను వ్యక్తిగతంగా రాసుకునేదేమీ లేదు. అలాంటి ఆలోచనలు పెట్టుకోవద్దు"అంది సౌరీస్. నిజానికి అప్పటికే సౌరీస్ భగవాన్ అధీనురాలై పోయి, ధ్యానం చేసుకోవడం, ఇలాంటి ఆధ్యాత్మిక భావాల వైపు వుంది. వేరే ఏ భావమూ ఆమె మనసులో లేదు.

ఈ కుర్రవాడు మాత్రం ఇద్దరిలో ఎవరో ఒకర్ని ప్రేమిస్తున్నాడు. ఆ విషయం చెప్పడం లేదు. మధ్యలో ఎవరో చెప్పారు తల్లి రంగనాయకమ్మ గారికి "ఆ కుర్రవాడికి ఇప్పటికే పెళ్లయి పోయింది. ఆ విషయం మీ దగ్గర దాచాడు. "అని. ఆ విషయం తెలిసాక తల్లి రంగనాయకమ్మ గారు ఒక రోజు ఆ కుర్రవాడు శాస్త్రిని కూర్చోబెట్టి " ఏమిటి బాబూ! మా పిల్లల మీద  నీకు ఏమైనా అభిప్రాయం వుందా?" అన్నారు." ఈ విషయం మీ పెద్దమ్మాయిని అడిగారా?"అన్నాడు.  మా పెద్దమ్మాయిని అడిగాను ఆమెకు నీ మీద ఎలాంటి అభిప్రాయం లేదు"అని రంగనాయకమ్మ గారు అన్నప్పుడు "నేను మీ రెండో అమ్మాయి నిర్మలను ప్రేమిస్తున్నాను"అన్నాడు.

అక్కడ నుండి  నిర్మల వెనకాల పడి, వాళ్ళు "వద్దు" అని అంటున్నా గానీ, జిడ్డులాగ పట్టుకొని "నిన్నే ప్రేమిస్తున్నాను... నిన్నే ప్రేమిస్తున్నాను ... " అనడం. పిల్లలిద్దరూ లేనపుడు, రంగనాయకమ్మ గారిని ఒప్పించి, నిర్మల ని చేసుకోవడానికి సిద్ధపడ్డాడు ఆ శాస్త్రి. సరే! కొన్ని రోజుల తర్వాత ఇంట్లో వాళ్ళు గట్టిగా చెప్పారు "అబ్బాయ్! మా

పిల్లలు నిన్ను పెళ్లి చేసుకోరు. ఎలాంటి ఆశలూ పెట్టుకోకు. ఇలాంటి వ్యవహారాలు మానేయ్. ఇంటికి రావడం కూడా తగ్గిస్తే మంచిది " అని ఆ శాస్త్రికి చెప్పారు. అదే సమయంలో నిర్మల బెజవాడలో చదువు తప్పేసరికి కాకినాడ లో చదివిద్దామని ఒక ట్రైన్ లో పంపించారు. అదే ట్రైన్ లో ఈ శాస్త్రి కూడా వెళ్ళాడట. ఆ విషయం తరువాత తెలిసింది. అతనికి పూర్తిగా అర్ధమై పోయింది. 'ఇక చలం గారి ఇంట్లో ఉండడం అసంభవం. వాళ్ళు రానివ్వరు. ' అని తెలుసుకొని , బయటకు వెళ్లి చలం గారి మీద చెడ్డ ప్రచారం మొదలుపెట్టాడు.

"చలం గారు లోకానికంతా చెబుతాడు. ఇంట్లో పిల్లల్ని మాత్రం జాగ్రత్తగా చూసుకుంటాడు. " అని. అప్పటికే అతను పత్రికల్లో ఏవేవో రాస్తూండేవాడు. నిర్మల మీద అక్కడక్కడ ఏవేవో కవితలు రాయడం లాంటి పనులన్నీ చేశాడు శాస్త్రి. అతని గురించి చలం గారు తన మిత్రులకు రాసిన ఉత్తరాల్లో ఇలా రాశారు "మొదట్లో జన్యున్ గా, చలం అడ్మయిరర్ గా, ఆ వీలును అడ్వాన్ టేజ్ గా ఉపయోగించుకొని, చలం కుటుంబానికి సన్నిహితుడై, తను పన్నిన పన్నాగాలు విఫలం కాగా, చలానికి ఆజన్మ విద్వేషి అయినాడు" అని.

ఆ తరువాత తెలిసింది ఏమిటంటే ... ఆ శాస్త్రికి ఎలాగైనా చలం గారి అల్లుడు అనిపించు కోవాలనే కోరిక ఉండేదట. అందుకని అన్ని ప్రయత్నాలూ చేశాడు. అవి కుదరక పోయేసరికి, బయట విష ప్రచారం ప్రారంభించాడు. సరే! అతని యొక్క అధ్యాయం అక్కడితో ఆగిపోయింది. కానీ, తరవాత రోజుల్లో అతను ప్రముఖ పాత్రికేయుడు అయ్యాడు. చలం గారు చనిపోయినప్పుడు అంటే, దాదాపు 40 సంవత్సరాల తర్వాత సంపాదకీయం కూడా రాశాడు. ఈ శాస్త్రిగారి అసలు పేరు "ఆంధ్రలో చలం "అనే పుస్తకంలో పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారు రాశారు. ఇది ఒక సంఘటన. ఈ సంఘటన ఆడపిల్లలిద్దరికీ ఒక గుణ పాఠం లాగా, డిస్ట్ర బెన్స్ లాగ కూడా అనిపించింది. దీని తర్వాత మరో రెండు సంఘటనలు జరిగాయి.

తల్లి రంగనాయకమ్మ గారు బెజవాడలో ఎక్కువగా సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనే వారనీ, ఆమె మునిసిపల్ కౌన్సిలర్ గా చేశారనీ, జిల్లా బోర్డు మెంబర్ గా చేశారని గతంలో అనుకున్నాం కదా! అయితే, ఏం జరిగిందంటే, చలంగారి మిత్రుడు 'హరిన్' అని ఒకతను బెంగుళూర్ లో ఉండేవాడు. ఆయన నాటకాలు వేస్తుండేవాడు. బెజవాడలో ఒకసారి నాటకం వేయడానికి వచ్చి, "ఆ నాటకం టిక్కెట్లు అమ్మిపెడతారా?"అని రంగనాయకమ్మ గారిని అడిగాడు. ఆమె అప్పటికే బయట కార్యక్రమాల్లో తిరుగుతున్నారు కాబట్టీ, "తప్పకుండా అమ్మిపెడతాను"అన్నారు. అలా అమ్మే కార్యక్రమం లో ఒక యూరోపియన్ ఆఫీసరుని కలుసుకున్నారు. అతను కుర్రవాడే. వయసు దాదాపు సారీస్, నిర్మల కంటే కాస్త ఎక్కువ ఉంటుంది. ఆ యూరోపియన్ ఆఫీసరు టిక్కెట్లు కొన్నాడు.

సరే! ఆ నాటకం ఏదో అయిపోయింది. ఆ తరువాత కొన్ని రోజులకి తల్లి రంగనాయకమ్మ గారు ఏవో కంపెనీ షేర్లు కొన్ని కొని, ఆ కంపెనీ షేర్ల ప్రారంభోత్సవానికి, ఆ ఆఫీసరుని కూడా ఆహ్వానించారు. అతను వచ్చాడు. సౌరీస్ కూడా ఆ ఫంక్షన్ లో వుంది. వాళ్లిద్దరూ ఒకరిని ఒకరు చూసుకున్నారు. బహుశా కూతురుకి పరిచయం అవుతుందనే ఉద్దేశ్యంతోనే పిలచి వుంటారు. ఆ ఫంక్షన్ లో సౌరీస్ పాటలు పాడింది. లీలగారు వీణ వాయించారు. వీటన్నిటికీ కూడా ఆ యూరోపియన్ ఆఫీసరు చాలా ఆకర్షింపబడ్డాడు. కాకపోతే, వాళ్ళు ఎక్కువగా మాట్లాడుకోవడం గానీ, అభిప్రాయాలు ప్రకటించుకోవడం గానీ జరగలేదు. ఆ తరువాత కూడా ఆ యూరోపియన్ ఆఫీసరూ, సౌరీస్ 2,3 సార్లు పార్టీల్లో కలుసుకున్నారు.

ఇలా జరుగుతున్నప్పుడు లీలగారు ఇది గమనించి రంగనాయకమ్మ గారితో చెప్పారు. “ఆ అబ్బాయికి , మీ అమ్మాయి మీద ప్రేమ వున్నట్లుగా వుంది. అదేదో మనమే ముందు వ్యక్త పరిస్తే బాగుంటుంది. నన్నొక సారి ఆ ఆఫీసరు దగ్గరకు తీసుకువెళ్ళండి ”అన్నారు. తల్లి రంగనాయకమ్మ గారూ,లీల గారు సౌరీస్ ని తీసుకొని అతని బంగాళాకి వెళ్లారు. అతనితో మాట్లాడి వచ్చాక, “ఆ అబ్బాయికి, మీ అమ్మాయి మీద ప్రేమ వుంది. మీరే ఏదైనా వుత్తరం రాసి, చొరవ తీసుకుంటే బాగుంటుంది. “అని లీలగారు చెప్పారు.

ఇదే సమయంలో రంగనాయకమ్మ గారికి జాతకాలు చెప్పేవారు “మీ పెద్దమ్మాయికి ఈ రోజుల్లో పెళ్లవుతుంది. వరుడు ఫలానా విధంగా ఉంటాడు”అని ఏవేవో గుర్తులు చెప్పారు. సరిగ్గా ఆ పోలికలన్నీ ఆ యూరోపియన్ ఆఫీసరుకి సరిపోయాయి. దాంతోటి తల్లి రంగనాయకమ్మ గారికి ఎలాగైనా సరే, ఈ అమ్మాయి అతన్ని చేసుకుంటే బాగుంటుంది అని ఉండేది. వీళ్ళు 2, 3 ఉత్తరాలు రాయడం, వాటిల్లో ఏవో చిన్నచిన్న పొరపొచ్చాలూ అపార్థాలూ.. ఇలా జరుగుతున్న సమయంలో ఆ యూరోపియన్ ఆఫీసరుకి ట్రాన్స్ ఫర్ అయిపోయింది. కాకపోతే, రంగనాయకమ్మ గారు మాత్రం ఆ విషయం మరచిపోలేదు.

వాళ్ళ చుట్టాలు ఎవరో నాడీ జ్యోతీష్యం చెప్పేవారు వున్నారంటే, వాళ్ళ తో పాటు మద్రాస్ వెళ్లి , సౌరీస్ కి నాడీ జ్యోతిష్యం చూపించారు. సౌరీస్ కి వున్న లక్షణాలు అన్నీ చెప్పారు. “ఈవిడ ఆధ్యాత్మిక ధోరణిలో ఉంది. ఈమెకు ఈ మధ్యన ఒక కుర్రాడు పరిచయం అయ్యాడు. “అన్నారు. వాళ్ళు ఆ కుర్రాడి గురించి చెప్పినపుడు అవన్నీ కరెక్ట్ గా ఆ యూరోపియన్ ఆఫీసరుకి సరిపోయాయి. దాంతోటి వాళ్ళ మాటలు నమ్మి, యేవో శాంతులూ, గ్రహాలూ, పూజలూ

ఇలాంటివి చేయడం ప్రారంభించారు. మళ్ళీ ఆ కుర్రవాడు వస్తాడు. సౌరీస్ ను పెళ్లి చేసుకుంటాడు. అనుకున్నారు. కానీ, అతను మళ్ళీ రాలేదు. అయితే, ఆ పూజలు చెయ్యడం, ఆ ఒత్తిడితోటి రంగనాయకమ్మ గారికి హిస్టీరియా లాగ వచ్చేసింది. కొన్ని సార్లు శ్మశానానికి వెళ్ళిపోయి, తెల్లవార్లూ శ్మశానం లో కూర్చోవడం ఇలాంటి పనులన్నీ చేసేవారు.

అంతగా ఆవిడ మానసికంగా దెబ్బతిన్నటువంటి పరిస్థితిలో మరొక సమస్య వచ్చి ఉండకపోతే, ఎంత దూరం వెళ్ళేవారో గానీ, ఇంకొకటి వచ్చి రంగనాయకమ్మ గారిని మరొక వైపు తీసుకువెళ్ళింది. ఆ సమస్య ఏమిటంటే, రెండో అమ్మాయి నిర్మల వివాహం. సరే! పెద్దమ్మాయికి ఎలాగూ ఆ యూరోపియన్ ఆఫీసరుతో కుదరలేదు. ఆ అమ్మాయి పెళ్లి కూడా చేసుకోనంటుంది. అప్పటికే పూర్తిగా ధ్యానం లోకి వెళ్ళిపోయింది. మధ్య మధ్యలో అరుణాచలం వెళ్లివస్తోంది. కనీసం రెండో అమ్మాయైనా పెళ్లి చేసుకుంటుందని ఎదురు చేస్తున్నటువంటి రోజుల్లో...

చలం గారి పెదనాన్న గారు కాకినాడ లో ఉండేవారు. వాళ్ళ అమ్మాయి పేరు 'రమణ' ఈ రమణనే చలంగారు పెళ్లి చేసుకుంటానని అనడం, ఆమె నీకు చెల్లెలు వరస అవుతుందని అంటే, శారద పీఠం వారికి వుత్తరం రాయడం జరిగాయి. ఇదంతా గతం. అయితే, ఈ రమణకు పెళ్లయిపోయింది. ఆమెకు పిల్లలు. ఆ రమణ గారి అబ్బాయి, మేనగోడలు వరస అవుతుందని నిర్మలని "పెళ్లిచేసుకుంటా" నని అన్నాడు. ఆ అబ్బాయి ఇంటికి వస్తుండేవాడు. నిర్మల కూడా మొదట్లో "బావని పెళ్లి చేసుకుంటానని "అంది గానీ, 4,5 నెలలు అయ్యాక ఎందుకో "పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు"అంది. చలంగారు అడిగారు "ఎందుకమ్మా ఇంత వరకూ చేసుకుంటానని అన్నావు కదా!"అంటే, "నాకు ఎందుకో భర్త అనే భావం కలగడం లేదు. మిత్రుడుగా అయితే ఉండగలను" అంది. తల్లి రంగనాయకమ్మ గారు కూడా ఒప్పించడానికి ప్రయత్నించారు గానీ, నిర్మల ససేమిరా ఒప్పుకోలేదు.

"చే "అని చలం గారి ఇంట్లో అందరూ పిలిచే నిర్మల గారే 2019లో కోయంబత్తూర్ లో 98 సంవత్సరాల వయసులో మరణించారు. జీవితాంతం ఆవిడ అవివాహితగానే ఉండిపోయారు. రంగనాయకమ్మ గారు యెంత ఒప్పించినా కనీసం రెండో అమ్మాయి పెళ్లి కూడా జరగలేదు. ఇంతలో ఆ కుర్రవాడు ఆత్మహత్య చేసుకుంటానని అనడం, రంగనాయకమ్మ గారు కాకినాడ వెళ్లి సర్ది చెప్పడం చేస్తున్న రోజుల్లోనే, ఆ కుర్రవాడి తల్లి చనిపోయింది. ఆ సందర్భంలో యేవో పూజలూ, శాంతులూ చేసారు. "ఆ చనిపోయినటు వ్యక్తి ఆత్మని తీసుకోస్తున్నాము. ఆమె నీతో మాట్లాడుతుంది." అని రంగనాయకమ్మ గారిని కూడా ఆ పూజలో కూర్చోబెట్టారు.

ఆ పూజల్లో ఏమైందో ఏమో గానీ, అప్పటికే మానసికంగా క్రుంగిపోయి వున్న రంగనాయకమ్మ గారు దాదాపు పూర్తిగా మానసిక సమతుల్యతని కోల్పోయారు. ఆవిడ ఏం చేస్తున్నారో ఆవిడకే తెలియని స్థితికి వెళ్లిపోయారు. మరి 30 ఏళ్ళ పోరాటం. ఎన్నో బాధలూ, కష్టాలూ ఒకవైపు భర్త తోటి, ఒక కుమారుడు చనిపోయాడు. మరో కుమారుడు

పూర్తిగా సోమరిగా వున్నాడు. ఆడపిల్లలు పెళ్లిళ్లు చేసుకోవడం లేదు. ఇన్ని బాధలతోటీ, ఇన్ని సమస్యల తోటి ఆమె ఎన్నిరోజులు ఎన్ని దశాబ్దాలు పోరాటం చేసినా గానీ ఇదిగో ఈదశలో లొంగిపోవాల్సివచ్చింది.

ఆ రోజుల్లో చలం గారు ఏలూరు లోనో, భీమిలి లోనో వుద్యోగం చేస్తుండేవారు. బెజవాడ వచ్చి వెళుతుండేవారు. లీల గారేమో, చలంగారితో వుంటుండేవారు. ఇలా రంగనాయకమ్మ గారికి మానసిక సమతుల్యత దెబ్బతిన్నప్పుడు సెలవలకి బెజవాడ వచ్చినపుడు చలం గారితో సంభాషణలు ఎలా ఉండేవంటే...”ఏమండీ” చలం గారు మాట్లాడేవారు కాదు. “ఏమండీ మిమ్మల్నే” ఆయన మళ్ళీ మాట్లాడేవాడు కాదు. “నిన్నే దరిద్రుడా” అనేదట ఆవిడ. “ఊ...ఊ...”అనేవారట నెమ్మదిగా, “ఆ దరిద్రగొట్టు రాతలూ, నువ్వునూ పుణ్యమా...పురుషార్థమా? కీర్తా, ధనమా? మొన్న మీటింగులో వాళ్లంతా యెంత తిట్టుకున్నారో తెలుసా?” ఇలా సాగేదట వాళ్ళ మధ్య సంభాషణ. దాదాపుగా రోజులో 3,4, సార్లు ఇలాంటి మాటలే అని వ్రాసుకున్నారు చలం గారు. ఇలాంటి స్థితిలో రంగనాయకమ్మ గారు ఎవరికీ చెప్పకుండా హఠాత్తుగా రమణ మహర్షి ఆశ్రమానికి వెళ్లిపోయారు. అంతకు ముందు 3,4 సార్లు వెళ్లి వున్నారు కదా! ఎలా వెళ్లాలో ఏమిటో ఆమెకు తెలుసు. వెళ్లి అక్కడ వుండి పోయారు.

ఆమె ఏమైందో ఏమిటో అని ఇంట్లో వాళ్ళు వెతికారు. కొన్నాళ్ళకు అక్కడ నుండి ఉత్తరం వచ్చింది. అప్పుడు తెలిసింది అరుణాచలం వెళ్లారని. ఇది 1945 లో జరిగింది. ఆమె రమణాశ్రమం వెళ్లినటు వంటి కొత్తలో ఆ చుట్టుపక్కల అంతా అరణ్యం లాగ ఉండేది. ఎక్కువ మంది నివాసం ఉండేవారు కాదు. ఆ ఆశ్రమంలో వుండేవారూ, లేకపోతే భక్తులు మాత్రమే ఉండేవారు. ఊరంతా దూరంగా ఉండేది. రంగనాయకమ్మ గారు అక్కడ ఉండడానికి వేరే వసతి లేక, అక్కడ ఒక చిన్న పూరి గుడిసె ఉంటే, అందులో రెండు మట్టి పాత్రలతో జీవిస్తుండేవారు. జీవితం యెంత విచిత్ర మైనది...!! ఎక్కడో బెజవాడలో కళ్ళు తెరచి, లోకం తెలియని వయసులో భర్తే లోకం అనుకుంటూ తెనాలిలో కాపురానికి వచ్చి, ఆ తరువాత మద్రాస్ లో చదువుకొని, భర్త స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతాలలో మునిగి తేలుతున్న దశాబ్దాలలో కూడా తన అస్తిత్వం కోసం పోరాడి, సంఘర్షించి, తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకొని 5 గురు పిల్లలకు తల్లయి, మరి కొందరికి పెంచిన తల్లయి ఎదిగి వచ్చిన కన్న కొడుకు అర్ధాంతరంగా కన్ను మూస్తే, కలిగిన అంతులేని విషాదాన్ని కడుపులోనే దాచుకొని, జీవితం కొట్టిన దెబ్బలకు ఎదురు నిలిచి, పోరాడి కూడా అలసి, సొలసి దిక్కు తోచని స్థితిలో ఇదిగో ఇలా తెలుగు నేలకు దూరంగా అడవిలో రమణ మహర్షి చెంత గుడిసెలో నివాసం వుంటున్నారు రంగనాయకమ్మ గారు. ఎంత విచిత్రం..!! ఎంత విషాదం...!! ఆ తరువాత పాతిక సంవత్సరాల పాటు ఆ ఆశ్రమ పరిసరాలే తన నివాసం అవుతాయనీ, తన చివరి క్షణాలు అక్కడే రాసి పెట్టి ఉన్నాయనీ, ఆ పిచ్చితల్లికి తెలియదు. పోనీ, అక్కడైనా ప్రశాంతంగా జీవించారా? అంటే, అదీ సందేహమే. చలం గారిని ఎలాగైతే

వెంటాడి, వేటాడి సమాజం నుండి బహిష్కరించి, తిట్లూ, శాపనార్థాలూ అనుక్షణం వెంటాడాయో, సరిగ్గా అదే పరిస్థితులే రంగనాయకమ్మ గారిని అరుణాచలం వెళ్ళిన తొలి రోజుల్లో ఎదురయ్యాయి.

అసలు ఏం జరిగిందంటే... అరుణాచలం అనగానే అన్ని రకాల వ్యక్తులూ అన్ని ప్రాంతాలనుండీ, అన్ని భాషల వాళ్ళూ వస్తుండేవారు. సహజంగానే కొంత మంది తెలుగు వాళ్ళు కూడా వున్నారు. రంగనాయకమ్మ గారు అక్కడకు వెళ్ళినపుడు, అక్కడ తెలుగు వాళ్ళు వున్నారంటే, చాలా సహాయంగా ఉండాలి కదా! కానీ, అలా జరగలేదు. రంగనాయకమ్మ గారు వెళ్లిన కొద్ది రోజులకి ఆమె చలం గారి భార్య అని అక్కడ తెలుగు వాళ్లకి తెలిసింది. వాళ్లందరికీ చలం గారి మీద ద్వేషమూ, చలం గారి మీద జరుగుతున్న దండయాత్ర ఇవన్నీ తెలుసు. అందువల్లనూ, ఈవిడ చేసే తెలిసీ, తెలియని పనుల వల్లనూ, ఆమెను ఎలాగైనా అక్కడ నుండి తరిమెయ్యాలని తెలుగు వాళ్ళందరూ, ముఖ్యంగా తెలుగు మహిళలు అనుకున్నారు. అనుకొని రంగనాయకమ్మ గారి మీద చాడీలు, ఉన్నవీ, లేనివీ చెప్పడం ప్రారంభించారు.

భగవాన్ కి చాలా దగ్గరగా వున్నవారు, భగవాన్ కి చెప్పారు "ఇలా ఆమె వచ్చారు. కానీ, ఆమె పరిస్థితి ఏమీ బాగుండలేదు. వాళ్ళ తాలూకా వాళ్ళు వచ్చి తీసుకువెళ్లి పోతే బాగుంటుంది. ఆమె తెలిసీ, తెలియని పరిస్థితిలో ఎవరికి ఏం అపకారం చేస్తుందో తెలియడం లేదు " అని. ఆశ్రమ నిర్వాహకులుకు అప్పటికే చలంగారినీ, అతని భార్యనీ, సౌరీస్ ని తెలుసు. ఎందుకంటే, అప్పటికి 9 ఏళ్లుగా వాళ్ళంతా పలు మార్లు అరుణాచలం వచ్చి వెళుతుండేవారు. అందుకని వాళ్ళ చిరునామా వుంది. బెజవాడలో వుండే డా: రంగనాయకమ్మ గారికి ఒక టెలిగ్రామ్ ఇచ్చారు. ఆ టెలిగ్రామ్ చూసి డా:రంగనాయకమ్మగారు చాలా బాధ పడ్డారు. వెంటనే ఏలూరులో వున్న చలం గారికి టెలిగ్రామ్ ఇచ్చారు. ఆ టెలిగ్రామ్ చూసిన వెంటనే లీల గారితో కలసి బెజవాడ వచ్చారు. వచ్చి, మళ్ళీ వెంటనే సౌరీస్ ను తీసుకొని అరుణాచలం వెళ్లారు.

అక్కడ రంగనాయకమ్మ గారి పరిస్థితిని చూసి చలంగారు నిర్లిప్తంగా ఉండిపోయారు. సౌరీస్ కి కళ్ళవెంట నీళ్లు తిరిగాయి. ఎందుకంటే అప్పటికే రంగనాయకమ్మ గారు సగం ఈ లోకంలో, సగం వేరే లోకంలో ఉన్నట్లున్నారు. వెళ్లిన వెంటనే కూతుర్ని కౌగించుకొని "చూడమ్మా! నేను ఇక్కడ వుంటుంటే నాకు విషం పెడుతున్నారు. నన్ను కొట్టడానికి వస్తున్నారు." ఇలా ఏవేవో మాటలు చెప్పారు. ఆ మాటల్ని ఆధారం చేసుకొని సౌరీస్ బ్రతిమిలాడారు. "వద్దమ్మా! మన ఇంటికి వెళ్ళిపోదాం. ఇక్కడ ఉంటే కొడతారని అంటున్నావు కదా!" అలా రెండు రోజులు బ్రతిమిలాడిన మీదట ఇంటికి రావడానికి ఒప్పుకున్నారు.

చలంగారూ, సౌరీస్ గారూ, రంగనాయకమ్మను తీసుకొని బెజవాడ రైల్లో బయలుదేరారు. రైలు ఎక్కిన కొంత సేపటికి రంగనాయకమ్మ గారు చెప్పారు "నేను భగవాన్ బొమ్మ ఉన్నటు వంటి లాకెట్ మింగేసాను. అది నా

కడుపులో వుంది “ అని. వాళ్లిద్దరూ కంగారు పడ్డారు. ఆమె తెలిసి చెబుతుందా? తెలియక చెబుతుందా? నిజంగా మింగేశారా? ఊరికినే చెబుతున్నారా? వాళ్లకి ఏమీ అర్థం కాలేదు. ఒకవేళ నిజమే అయితే, ప్రాణాపాయ పరిస్థితి. మద్రాస్ లో దిగిపోయి, డాక్టర్ కి చూపించి అనుకున్నారు గానీ, డాక్టర్ రంగనాయకమ్మ గారు “వెంటనే చెల్లెల్ని తీసుకువచ్చేయండి ఎక్కడా ఆగవద్దు.“ ముందే చెప్పారు.

అందువల్ల సరాసరి బెజవాడ తీసుకువెళ్లారు. విచిత్రంగా బెజవాడలో దిగగానే ఆమె మామూలు అయిపోయారు. పొంతన లేని మాటలు, మాట్లాడడం ఇలాంటివి తగ్గిపోయాయి. డాక్టర్ గారు అడిగిన మీదట చెప్పారు ” నేను లాకెట్ మింగిన మాట నిజమే”అని. ఆమె కూడా ఈమెకు ఆపరేషన్ చేయించాలని ఆలోచించారు గానీ, అంతలో సహజ జీర్ణ క్రియలో ఆ లాకెట్ బయటికి వచ్చేసింది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాకపోతే, ఎప్పుడూ భగవాన్ ధ్యాసా, భగవాన్ నామస్మరణం ఇలా ఉండేవారు. అయితే ఉన్నట్టుండి అమావాస్యకీ, పౌర్ణమికీ మాత్రం మతి స్థిమితం లేకపోవడం అనేది తిరగబెట్టింది. అలాంటి స్థితిలో ఒకసారి పోలీస్ స్టేషన్ కి కూడా వెళ్లి “మా ఇంట్లో వాళ్ళు నాకు విషం పెట్టాలని చూస్తున్నారు” అని కంప్లయింట్ ఇచ్చారు. కాకపోతే వాళ్లందరికీ ఈ కుటుంబ సభ్యులు అందరూ తెలియడం.. పైగా, డాక్టర్ గారు పేరున్నవారు కాబట్టి, పెద్దగా పట్టించు కోలేదు. ఇలా ఉంటుండగనే భార్య రంగనాయకమ్మ గారు ఒకసారి మాయం అయిపోయారు.

ఇంట్లో వాళ్ళు “ మళ్ళీ అరుణా చలమే వెళ్లి ఉంటుంది.ఇంకెక్కడికి వెళుతుంది?” అనుకున్నారు. కానీ, జరిగినది ఏమిటంటే, అరుణా చలం సరాసరి వెళ్ల కుండా మధ్యలో మద్రాస్ లో దిగి, అక్కడ గవర్నర్ ఆఫీసుకి వెళ్లి, ఆ గవర్నర్ గారి ప్రయివేట్ సెక్రెటరీని కలుసుకొని, “నేను అరుణా చలంలో ఉండడానికి వెళుతున్నాను. అంతకు ముందు ఒకసారి వచ్చాను. అక్కడ వున్న తెలుగు వాళ్ళు నా మీద బురద జల్లడానికీ, నాకు హాని చెయ్యడానికీ ప్రయత్నిస్తున్నారు కాబట్టీ, మీ సహాయం కావాలి “ అని ఆ గవర్నర్ ఆఫీసులో చెప్పారు. ఆ గవర్నర్ ఆఫీసు వాళ్ళు దాన్ని తీవ్రంగా తీసుకొని, ఆ అరుణా చలం ఆశ్రమానికి ఒక సందేశం పంపించారు.

“ ఈమెను జాగ్రత్తగా చూసుకోండి. ఈమెకు ఏమైనా హాని జరిగిందంటే, దానికి మీరే భాధ్యులవుతారు. “అని. సందేశం పంపించడమే కాకుండా మధ్య, మధ్యలో ఎవరో ఒకర్ని పంపించి, రంగనాయకమ్మ గారి సరిగ్గా ఉందా ,లేదా? అని తెలుసుకుంటుండేవారు. అంతగా తెలిసీ తెలియని స్థితిలో కూడా గవర్నరు ఆఫీసుకు వెళ్లడం, వాళ్ళని ఒప్పించి, తన రక్షణ కోసం, తనను చూసుకునే పరిస్థితిని ఆవిడే కల్పించుకున్నారు. గవర్నర్ ఆఫీసు నుండి సందేశం వచ్చేసరికి రమాణాశ్రమంలో ఉన్న వాళ్ళు కూడా రంగనాయకమ్మ గారిని వేధించడం తగ్గించారు. కానీ,వాళ్ళు ఏమనుకున్నారంటే... “ఆశ్రమానికి రాకుండా చూద్దామంటే, ఈవిడ ఇలా చేసింది. ఇలా కాకుండా ఈవిడను ఈ ఊరి నుండే పంపించేద్దాం”అనుకోని వేరే వేరే ప్రణాళికలు ఆలోచించారు. ఈ విషయం రంగనాయకమ్మ గారికి

తెలిసింది. ఈమె మద్రాస్ వెళ్లి, అక్కడ వకీలును మాట్లాడుకొని, ఆ వకీలును వెంట బెట్టుకొని అరుణా చలం వచ్చారు. ఆ లాయరు సమక్షంలో మిగతా వాళ్ళందరినీ ప్రశ్నలు అడిగాడు "ఎందుకు మీరందరూ ఈవిడ పట్ల ఇలా ప్రవర్తిస్తున్నారు.?" అని. అక్కడ వున్న తెలుగువాళ్లకు వార్నింగ్ ఇచ్చాడు. అప్పుటి నుండి ఆ వేధింపులు తగ్గాయి. తరువాత రంగనాయకమ్మ గారు ఆ గుడిసె లో ఉండడం, భగవాన్ దగ్గరకు వెళ్లి రావడం కొనసాగుతున్నాయి.

అయితే, బెజవాడకి మాత్రం ఉత్తరాలు రాస్తూండేవారు. ఆమె రాసే ఉత్తరాల్లోని విషయం ఒకదానికొకటి పొంతన ఉండేది కాదు. చలం గారు చిన్నప్పటి నుండి ఒక మానసిక శాస్త్ర వేత్త అనడానికి ఒక ఉదాహరణ ఏమిటంటే ... రంగనాయకమ్మ గారు ఇలా ఉత్తరాలను రాయడాన్ని సమీక్షిస్తూ ఇలా రాసారు. "నిజానికి అప్పట్లో అవన్నీ కూడా నాన్సెన్స్ ఏదో రాస్తున్నారు అనుకున్నాం గానీ, ఇలా మతి భ్రమించింది అనుకున్న వాళ్ల కి నిజంగా మతి భ్రమించడం కాదు. వాళ్ళ యొక్క ఆలోచనలూ, వాళ్ళ యొక్క మనసూ ఒక ప్లేన్ లో ఉంటుంది. మన ప్లేన్ లో ఉండదు. అంతే, అందువల్ల వాళ్ళు మనలాగా ఆలోచించ లేకపోతున్నారనీ మన లాగ పనులు చెయ్యడం లేదనీ వాళ్ళకి మతి స్థిమితం కోల్పోయారు. మతి భ్రమించింది. అనుకుంటాం.వాళ్లకి కూడా మనం అలాగే కనిపిస్తాం. ఇదంతా ఒక మానసిక స్థితిలో ఉన్నటు వంటి పొరలు. వాళ్ళ పొర వేరు. మన పొర వేరు. వాళ్ళ తలం వేరు.మన తలం వేరు." ఇలా చలం గారు తన ఆత్మ కథలో రాసుకున్నారు.

మరి ఆమె ఒక్కరే ఉండాలంటే, ఆమె పోషణకు డబ్బులు ఉండాలి కదా! ప్రతి నెలా డాక్టరు గారే డబ్బులు పంపిస్తుండేవారు. కాస్త సౌకర్యంగానే ఉంటుందిలే అనుకున్నారు. అయితే, ఆ తరవాత తిరువణ్ణామలై నుండి వచ్చినవారు డాక్టరు గారికి చెప్పారు." అమ్మా! మీరు డబ్బులు పంపిస్తున్నారు బాగానే వుంది. అక్కడ ఆవిడ చిరిగిన బట్టలు కట్టుకుంటోంది. ఒక రోజు తింటుంది. ఒక రోజు తినదు. మీరు పంపిన డబ్బులతో బిస్కట్లు కొని భగవాన్ దగ్గరకు వెళ్లి, "తినండి... తినండి..." అని ఆయన్ని బలవంతం చేస్తుంది. అలాగే అక్కడకు వచ్చిన పర్యాటకులకు సహాయం చేస్తుంది." ఆమె కూడా చెయ్యగలిగింది ఏమీ లేక ఊరుకున్నారు. డబ్బులు పంపించడం మాత్రం మానలేదు. ఇదంతా 1945 లో. ఇక్కడ నుండి మనం ఒక్కసారి బెజవాడ వెళ్లి చలం గారి కుటుంబం ఎలా వుందో తెలుసుకుందాం.

చలం గారు , లీల గారితో అతను వుద్యోగం చేసే ఊరిలోనే వున్నారు. అప్పుడప్పుడు బెజవాడ వచ్చి పిల్లలతో గడిపి వెళుతున్నారు. ఇక డాక్టర్ రంగనాయకమ్మ గారి పరిస్థితి చూస్తే, అప్పటి వరకూ వున్న ఆసుపత్రి బాధ్యత తో పాటు, ఆరుగురి పిల్లలను కూడా చూసుకోవాల్సిన పరిస్థితి. పెద్ద పిల్లలు సౌరీస్, నిర్మల, వసంత్ వీళ్లంతా 20 ఏళ్ళు దాటిన వాళ్ళు. తరువాత వాళ్ళు 15 సంవత్సరాలకి అటూ, ఇటూగా వున్నవాళ్లు. పక పక , చిత్రా, నర్తకీ ఎవరూ ఏ ఉద్యోగమూ చేసేవారు కాదు. కాబట్టి అందరికీ, అన్ని సౌకర్యాలూ సమకూర్చేది డాక్టర్ గారే అయ్యారు. కనీసం తల్లి

రంగనాయకమ్మగారు బెజవాడలో ఉండి ఉంటే చిన్న పిల్లల్ని చూసుకుండేవారు. తను ఆసుపత్రి మీద కేంద్రీకరించడానికి వీలయ్యేది. ఇప్పుడది లేదు.

అదే రోజుల్లో వసంత్ పరిస్థితి మరింత దిగజారింది. అతనికి బెజవాడలో చాలా మంది స్నేహితులయ్యారు. ముఖ్యంగా బాగా డబ్బున్న పిల్లలతో స్నేహం అయింది. వాళ్లతో కలసి బయటకు వెళ్లడం, అడవిలోకి వేటకు వెళ్లడం ఇలాంటివే కాకుండా, మద్యానికి కూడా అలవాటు పడ్డాడు. ఎప్పుడూ తాగడం, అలాంటి పరిస్థితిలో ఇంటికి రావడం చేస్తుండేవాడు. పనేమీ చెయ్యక పోవడం వలన, ఏ సహాయమూ అతని నుండి రాలేదు. ఇలాంటి పరిస్థితిలో ఒకసారి పిల్లల్ని చూసుకోవడానికి బెజవాడ వచ్చినపుడు, చలం గారితో, వసంత్ చెప్పాడు...

"నేను మిమ్మల్ని నాలో నుండి తీసేసుకోబోతున్నాను. మిమ్మల్ని గనక నాతో ఉంచుకుంటే, సమాజం నుండి నేను వెలి వేయబడి ఒంటరై పోతాను. నాకు అలా బ్రతడం ఇష్టం లేదు. నాకు, నా స్నేహితులు ఇష్టం. వాళ్లందరితో నేను బ్రతకాలంటే, మీ నుంచి నన్ను నేను దూరం చేసుకుంటున్నాను." అన్నాడు. అలా చెప్పడానికి కారణం ఏమిటంటే, అతని స్నేహితులు అనేవారట "ఏమిటో మీ నాన్న అలాంటి వాడు. మిమ్మల్ని అందర్నీ వదిలేసి, అక్కడ ఎవరో అమ్మాయితో ఉంటున్నాడు." అని. అదంతా వినగా... వినగా... అతను కూడా "నిజమే మా నాన్న అలాంటి వాడే" అని మనసులో ఉంచుకొని చలం గారిని అలా అడిగాడు.

చలంగారు ఏ మాత్రం అదరకుండా, బెదరకుండా చాలా స్థిమితంగా "సరే ! నీకు అదే మంచిదయితే అలాగే చెయ్యి. తప్పకుండా నన్ను నీలో నుండి తీసేసుకో. గో ఆన్ ప్రొసీడ్."

అతను అలా తీసేసుకున్నాడు. అంటే మానసికంగా తండ్రి తో సంబంధాన్ని తెగ్గొట్టుకున్నాడు. అట్లా వున్నప్పుడు ఈ బాధలన్నీ చూసి వసంత్, నిర్మలా ఒకసారి అనుకున్నారట. "మనం సూసైడ్ చేసుకుంటే సరిపోతుంది. ఆత్మహత్య చేసుకుందాం. ఈ లోకంలో ఉండలేం. నాన్న చూస్తే అలాగ. ఎప్పుడు వస్తాడో తెలియదు. ఎప్పుడు వెళ్తాడో తెలియదు. అమ్మ చూస్తే వెళ్ళిపోయింది. బాధలన్నీ ఒయ్యికే వచ్చాయి." అని. ఇలా ఇద్దరూ అనుకుంటున్నపుడు సౌరీస్ చెప్పింది "భగవాన్ చెప్పాడు. ఆత్మహత్య మహా పాపం. అలాంటిది చెయ్యకూడదని. పైగా ఒయ్యి మనల్నందరినీ బాగా చూసుకుంటోంది. ఆవిడను వదిలేసి మీరు ఆత్మహత్య చేసుకోవడం అనేది మంచిది కాదు. " అని.

అసలు ఆ వయసులో ఆత్మహత్య చేసుకుందాము అనేటటు వంటి ధైర్యం గానీ, ఆలోచన గానీ వచ్చింది అంటే...చలం గారు చిన్నప్పటి నుండి కూడా పిల్లల్ని పెంచేటటు వంటి క్రమంలో ఆత్మహత్య గురించి ఎప్పుడూ మాట్లాడేవారట. "ఆత్మహత్య చేసుకోవడం తప్పు కాదు. ఆత్మహత్య అంటే ఏమీ లేదు. ఈ పరిసరాల నుండి ఇంకో

పరిసరాలకు వెళుతున్నాం. ఒక ఫైన్ డే హాయిగా, మంచి భోజనం తిని, గొప్ప సంగీతం వింటూ , వెన్నెల్లో కూర్చొని, వైన్ లో విషం కలుపుకొని తాగేద్దాం. చావంటే ఇంత కంటే ఏం లేదు. " ఇలాంటి మాటలు చెబుతుండేవారట.

అందుకని పిల్లలు ఇలా ఆలోచించడానికి ఏమీ వెనకాడ లేదు. అయితే, సౌరీస్ చెప్పిన మీదట వాళ్ళు, "నిజమే మనం అందరమూ వెళ్ళిపోతే , డాక్టర్ గారికి ఏమవుతుందో. అందుకని ఇలాంటి పని వద్దు " అనుకున్నారు. కాకపోతే వాళ్ళు ఒక నిర్ణయానికి వచ్చారు. తరువాత రోజుల్లో మనం ఎప్పుడైనా ఆత్మహత్య చేసుకుందాం అనుకుంటే మనం ముగ్గురం సామూహికంగా చేసుకోవాలి. ఎవరూ ఈ షరతుని అతిక్రమించకూడదు అని.

ఇంత క్లిష్టమైన పరిస్థితుల్లో అందరూ బెజవాడలో ఉండగా, డాక్టర్ గారి మీద ఒత్తిడి పడడం చూస్తూనే వున్నారు సౌరీస్, నిర్మలా. "డాక్టర్ గారికి మనం కూడా సహాయం చెయ్యాలి" అనుకున్నారు. సహాయం అంటే ఎలా? డాక్టర్ గారు పేషంట్లను చూడడం తగ్గించి, "మీరు కూర్చోండి "అని చెప్పి వీళ్ళే చూడడం ప్రారంభించారు. డాక్టర్ గారు చెప్పినటువంటి సలహాలతో వీళ్ళే మందులు ఇచ్చేవారు. పేషంట్లకు కూడా వీళ్ళ మీద మంచి అభిప్రాయమే వుంది. ఎందుకంటే, పేషంట్లతో మంచిగా మాట్లాడడం, వాళ్ళ క్షేమ సమాచారాలు కనుక్కోవడం చేసేవారు. అందుకని అందరూ అభిమానించేవారు.

ఇప్పుడు ఈ పిల్లలిద్దరూ డాక్టరు గారికి సహాయం చేస్తున్న పరిస్థితిలో తెలిసిన దేమిటంటే, ఆవిడ సరిగ్గా ఫీజులు తీసుకోవడం లేదు. ఇచ్చిన వాళ్ళు ఇవ్వడం, లేనివాళ్లు లేదు. కానీ, కొంత మంది ఇవ్వగలిగిన వాళ్ళు కూడా ఇవ్వక పోవడం ఇవన్నీ నిర్మల గమనించింది. ఇలా కాదని, ఇవ్వగలిగిన వాళ్ళ దగ్గర ఖచ్చితంగా వసూలు చెయ్యడం ప్రారంభించింది. అలా వసూలైన డబ్బులు పొదుపు చెయ్యడం మొదలుపెట్టారు. నిర్మల వసూలు చేసినవే తప్ప అంత వరకూ డాక్టర్ గారు దాచినదేమీ లేదు. "దీని వలన రెండు ఉపయోగాలు జరిగాయి. ఒకటి ఎంతో కొంత ఆదాయం రావడం. రెండు డాక్టర్ గారికి విశ్రాంతి" జరిగిందని సౌరీస్ తన ఆత్మ కథలో రాసుకున్నారు.

ఇంత వరకూ పెద్ద పిల్లల గురించి తెలుసుకున్నాం. చిట్ట చివరి సంతానం పకపక. ఆమె కంటే పెద్దది పెంపకానికి తీసుకున్న చిత్ర. అలాగే వాళ్ళ ఇంట్లోకి నడచి వచ్చిన నర్తకి. ఈ ముగ్గురి పిల్లల జీవితాలూ ఎలా గడిచాయి. వాళ్ళ యొక్క సంగతులు ఏమిటి?

డాక్టర్ గారు ఈ పిల్లల కైనా చదువు చెప్పిద్దామని, ఒక ట్యూషన్ పెట్టించి, ఇంట్లోనే చదువు చెప్పించడం ప్రారంభించారు. ఆ చదువు కూడా కొద్ది నెలలో, ఒక సంవత్సరం పాటే కొనసాగింది. తరువాత వాళ్లకి చదువు మీద అంతగా ఆసక్తి లేదు. డాక్టర్ గారు కూడా ఒత్తిడి పెట్టలేదు. పోనీ చదువు రాలేదు. కనీసం డాన్సు అయినా నేర్పిద్దామని "శిష్ట్లా పూర్ణయ్య శాస్త్రి "అనే ఆయన దగ్గర డాన్సు నేర్చుకోవడానికి చేర్పించారు. పకపక, చిత్రా, నర్తకీ ముగ్గురినీ. ఇది సుమారు 1946 ప్రాంతాలలో జరిగింది. అక్కడకు వెళ్లి, ముగ్గురు పిల్లలూ డాన్సు నేర్చుకునేవారు.

ఇక్కడ ఒక ఆసక్తికరమైన విశేషం ఏమిటంటే..ఆ శిష్టా్ల పూర్ణయ్య శాస్త్రి దగ్గర డాన్సు నేర్చుకునే రోజుల్లోనే ఒక సంవత్సరం అటు ఇటుగా బెజవాడ ఇంకో పాప కూడా ఆయన దగ్గర డాన్సు నేర్చుకునేది. చాలా మంది నేర్చుకొని వుంటారు. కానీ ఆ 'ఇంకో పాప' అని ఎందుకు అన్నానంటే, ఆమెకు చాలా ప్రత్యేకత వుంది. తరువాత రోజుల్లో ప్రఖ్యాత నటీమణి. మహా నటి "సావిత్రి". అంటే, చలం గారి పిల్లలూ, సావిత్రి ఒకే గురువు దగ్గర డాన్సు నేర్చుకున్నారు. అది కూడా ఎక్కువ కాలం జరగలేదు. అక్కడ కూడా మానేశారు.

ఇంట్లోనే వుండి డాక్టర్ గారికి సహాయం చేస్తుండేవారు. ఇవన్నీ 1946 ప్రాంతాల్లో జరిగాయి. తరువాత ఈ కథ నుండి మరో రెండు పాత్రలు నిష్క్రమించబోతున్నాయి. మరో సంవత్సరానికి చలం గారు కుటుంబంతో సహా అరుణాచలం వెళ్లిపోయారు. ఈ 1946– 50 సంవత్సరాలు చలం గారి జీవితంలో అత్యంత సంక్షోభ సమయం అదేమిటో తరువాత భాగంలో తెలుసుకుందాం...

★★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 ఏప్రిల్ 2 న, ప్రసారమైన ఈ టాక్ షో ని ఇక్కడ వినవచ్చు

COMMENTS